# మంచు కురుస్తూనే ఉంది.



**ఈ టైంలో ఒకవేళ అరుంధతి నిద్రలేస్తే...**

**పక్కనే ఉండాల్సిన తను, లేక పోవడం చూసి కంగారు పడు తుందా? ఇది తనకలవాటే అని ఓ భారమైన నిట్టూర్పు విడిచి, వీధి తలుపులు మూసి ఉన్నాయో లేదో నని ఓసారి చూసి పడుకుంటుందా? ఒక్క క్షణం అలా ఆలోచించగానే కామేశం మనసు చివుక్కుమంది.**

బీరువాలో అరుంధతికి ఇష్టమైన నెక్లెస్ తను దొంగిలించాడు. తనింట్లో తనే దొంగతనం చేశాడు. పెళ్లయిన మరుక్షణం నుంచి తనే దైవంగా, ప్రాణంగా ప్రేమిస్తోన్న తన భార్యను తను మోసం చేశాడు. కేవలం చిత్రాంగి కోసం. అది తన వీక్‌నెస్.

చిత్రాంగి ఆలోచనల్లోకి రాగానే ఒంట్లో రక్తం వెడెక్కసాగింది విరహంతో.

"ఒరేయ్ కామేశం నువ్వట్రా" ఆ పిలుపుతో ఉలిక్కిపడి తల తిప్పాడు.

"నేను... దివాకరాన్ని... మరిచిపోయావా? హైస్కూల్‌లో నీ క్లాస్‌మేట్‌ని, బెంచిమేట్‌ని కూడా... ఏంటి... ఇంకా కలలు కనే పిచ్చి తగ్గలేదా? ఇది నా భార్య శ్రీలక్ష్మి... అంటూ భార్యని పరిచయం చేశాడు.

"వీడు కామేశం... అని నా చిన్ననాటి స్నేహి తుడు... కాస్త టైం దొరికితే చాలు... కలల ప్రపంచంలోకి వెళ్ళిపోతాడు. కలల కామేశం చిన్న ప్పుడు నిక్‌నేమ్ కూడా పెట్టాం... భార్యకు కామేశం గూర్చి చెబుతూనే ఉన్నాడు. ప్రయాణీకులు నిద్రపో తున్నారు. కండక్టర్ కూడా ఓ కునుకు తీస్తున్నాడు. కామేశానికి ఏం చేయాలో తోచలేదు.

"ఏంటి ఎక్కడికెళ్తున్నావురా?" అడిగాడు దివా కరం.

"అది... వ...వలసపాడుకు"

"అక్కడుంటున్నావా? ఏంటి పెళ్ళయిందా? పిల్ల లెంత మంది? ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఉన్నాడు."

ఇక మార్గం లేదనుకుని, రాని ఆవలింపులను తెచ్చుకుని, 'నిద్రొస్తోందిరా' అన్నాడు.

"సర్లే... నేనూ వలసపాడుకే... ఈ రాత్రికి తెలిసిన బంధువులింటికి వెళ్దామనుకున్నా... మీ ఇంట్లోనే మకాం వేస్తాను. చెల్లెమ్మను చూసినట్టూ వుంటుంది అంటూ తనూ సీటుకు జారగిలపడి, కన్నుమూశాడు దివాకరం.

సడన్ బ్రేక్‌తో బస్సాగింది. ఎదురుగా రైల్వే గేటు, ఏదో రైలు వస్తున్నట్టుంది. అందుకే గేటు వేశారు. 'ఇదో న్యూసెన్స్ అయింది' విసుక్కున్నాడు బస్సు డ్రైవర్.

కళ్ళు మూతలు పడుతున్నా కామేశానికి నిద్ర రావడం లేదు. భార్య కన్నుగప్పి, తీసుకొచ్చిన నెక్లెస్ ప్యాంటు జేబులో భద్రంగా వుంది. చిత్రాంగి కోసం తాను తెగించాడు.

చిత్రాంగి ఈ నెక్లెస్‌ను చూసి ఎంత సంతోషి స్తుందో!? అతని కళ్ళు అరమోడ్పులయ్యాయి!

* * *

"వచ్చావా కామూ... తన్మయత్వంగా అంటూ అతని మెడచుట్టూ చేతులు వేసింది చిత్రాంగి.

మంచి ఎత్తు, ఎత్తుకు తగ్గ లావు. చక్కటి శరీర సౌష్ఠవం... పైగా వృత్తిపరమైన నేర్పరితనం... జాణ తనం. అలా అలవోకగా తన చేతులను కామేశం చుట్టూ వేసి దగ్గరికి లాక్కుంది. ఆ ప్రయత్నంలో అప్రయత్నంగా చిత్రాంగి పైట తొలగింది.

చిత్రాంగికి కామేశం చేతిలో నెక్లెస్ కనిపిస్తుంది. కామేశానికి మాత్రం చిత్రాంగి వంటి మీద తొలగిన పైట... ఆ పైటని అట్టిపెట్టుకోవాల్సి వక్షసంపద కనిపిస్తుంది.

ఎరుగదు చన్నుదోయి బిగియించి కరంబుల. బట్టు టంతము

నెరుగదు వాడిగోళ్ళ తుద నిక్కువ లెల్లను గ్రుచ్చుటేమియు...

ఎక్కడో చదివిన పద్యం గుర్తుకొచ్చింది.

అతని తల కిందికి జరిగింది...

అతని ఉచ్ఛ్వాసం ఆమె హృదయభాగాన్ని తాకి, ఉక్కిరిబిక్కిరయింది.

ఆమె నిశ్వాసం అతని శరీరానికి గిలిగింతల య్యాయి.

అతను పెదవులకు పని చెప్పాడు.

ఆమె అతన్ని లతలా పెనవేసుకుంది.

అక్కడ గాలి వేడిగా మారింది.

ఇద్దరి నిట్టూర్పులు... శతసహస్రాగ్నికీలల య్యాయి.

కటిక నేలే... పవళించు సేవకు పాన్పుగా మారింది.

ఏ ఆచ్ఛాదనా లేకుండా ఆ ఇద్దరూ... క్షణాలు నిమిషాలయ్యాయి...

అతని ఆకలి తీరింది ఆమెతో.

ఆమె ఆకలి తీరింది అతను తెచ్చిన నెక్లెస్‌తో

ఆర్థిక, శారీరక సంబంధాల లావాదేవీల మధ్య... చిన్న ఇంట్రప్షన్... కాలింగ్ బెల్ చప్పుడు.

కంగారుగా లేచి బట్టలు సర్దుకుని, అద్దంలో మొహం చూసుకుని కంగారుగా కామేశాన్ని పక్క రూమ్‌లోకి వెళ్ళమంది. అతను బిత్తరపోయాడు.

ఆ వచ్చింది సేఠ్ చంపాలాల్ అన్జెప్పింది.

"అయితే ఏమిటి?" బిత్తరపోయి అడిగాడు.

"అతను రావాల్సిన టైంలో నువ్వొచ్చావు. ఈ విషయం అతనికి తెలిస్తే..."

"అంటే నేను..."

"నువ్వు సెకండ్ ఆఫ్ నైట్ షిఫ్ట్ కస్టమర్‌వి" తన ఒరిజినల్ భాషలో చెప్పింది చిత్రాంగి.

"నేను నెక్లెస్ తెచ్చాను" ఉక్రోషంగా అన్నాడు కామేశం.

"అందుకు సరిపడా అనుభవించావుగా... సేఠ్ వడ్డాణం తెస్తానని చెప్పాడు.

"నన్ను (ప్రేమించలేదా) అపనమ్మకంగా అడి గేడు.

నవ్వించి చిత్రంగా చిత్రాంగి.

"నువ్వు రెగ్యులర్ కస్టమర్‌వి అని కాస్త ప్రేమ ఎక్కువ చూపిస్తున్నా... నీకేమైనా పర్మినెంట్ సెట ప్పవనుకున్నావా? నువ్వేమైనా పెంటపాడు జమీం దారువనుకున్నావా?

"రాక్షసీ... నువ్వసలు మనిషివి కాదు" గట్టిగా అరిచేడు కామేశం... అతని అరువుకు...

* * *

బస్సులోని జనం ఉలిక్కిపడి లేచారు.

"ఏమైందిరా కాముడూ..." దివాకరం గాబరాగా

**విజయార్కె**

## ఈ వారం కథ

**ఇన్నాళ్ళుగా, ఏమాత్రం శృంగార ఆకర్షణ లేనట్టుగా కనిపించే భార్యలో అతను ఇప్పుడు అద్వితీయమైన మానసిక సౌందర్యాన్ని చూస్తున్నాడు!**

అడిగాడు. చుట్టూ చూశాడు చిత్రాంగి లేదు. తనింకా బస్సులోనే ఉన్నాడు.

"నేను... నేనెక్కడ వున్నాను" అయోమయంగా అడిగాడు. ఖర్మ... అంటూ నెత్తిమీద కొట్టుకుని దివాకరం... "మళ్లీ ఈ పది నిమిషాల్లోనే ఏదో ఓ కల కని వుంటావు. గేటు పడింది. రైలు ఇప్పుడే వెళ్ళిపోయింది. కాసేపట్లో గేటు తీస్తారు. నువ్వు వలసపాడులో దిగుతావు సరేనా... కలలు కని కంగారు పెట్టకురా" అన్నాడు అనునయంగా.

తల విదిల్చాడు.

కల... కలైనా, తనని కలవరపరిచినా, 'కల' వరంగా మారింది.

ఓ నిర్ణయానికి వచ్చాడు.

'డ్రైవర్ బస్సాపండి' అరిచాడు. బస్సులోని జనం వింతగా చూస్తున్నారు నిద్రమత్తులోనే. దివాకరం ఏదో చెప్పబోయాడు.

కామేశం అదేమీ వినిపించుకోకుండా "సారీరా. దివాకరం... ఇదిగో నా కార్డు... ఓసారి వీలైనప్పుడు ఇంటికి రా" అంటూ బస్సు దిగేశాడు.

తన ఊరికి వెళ్ళే బస్సు కోసం అటు వైపు బస్టాండ్‌లో నిలుచున్నాడు. బస్సొచ్చింది. అతనికి బుద్ధి వచ్చింది.

* * *

ఇంకా మంచు కురుస్తూనే ఉంది. పూర్తిగా తెల్లవారనే లేదు. కొందరు అప్పుడే లేచి కళ్లాపి వల్లి ముగ్గు పెడుతున్నారు. కామేశం ఇంటికి వెళ్ళేసరికి...

ఇంటి ముందు నిలబడి ఎదురుచూస్తోంది అరుంధతి. అభిసారికలా...!

తన కోసం... ఎస్పెషల్లీ తన కోసం... అంటే రాత్రంతా తన కోసమే... నిద్రపోకుండా... తనని చూడగానే ఆమె మొహంలో వెలుగు. కోటి ప్రభల వెలుగు.

"వచ్చారా... రండి... ఇంత చలిలో స్వెటర్ లేకుండా... ఆమె మాటలు ఇంకా పూర్తికాకుండానే ఆమెను దగ్గరికి తీసుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

మంచితనం కూడా ఎంత పెద్ద శిక్షో అర్థమయింది. "నన్ను క్షమించు అరూ..." అన్నాడు గిల్టీగా.

"ఎందుకు?" అంది అరుంధతి.

"నెక్లెస్..."

"అతని నోటిని చేతితో మూసి తెలుసు..." అంది.

"అయినా నేనంటే..." అతను ఆమె గుండెల మధ్య తలదాచుకున్నాడు.

అతని తలను తన గుండెలకు హత్తుకుంది. అతను ఆమె ఒడిలో తలపెట్టి పడుకున్నాడు. అతనికి అది ఓదార్పయింది.



ఇన్నాళ్ళూ ఛామనఛాయగా సెక్సీ లుక్ లేనట్టు కనిపించే భార్యలో ఇంత అద్వితీయమైన మానసిక సౌందర్యాన్ని ఇప్పుడే చూస్తున్నాడు.

పవిత్రంగా... అతి పవిత్రంగా "నీ కోసమే నేను సుమా..." అన్నంత అతి భద్రంగా అతన్ని లతలా అల్లుకుపోయి, తనకు తానుగా అర్పితమవ్వడానికి సిద్ధమైంది.

ఇద్దరి మధ్య రాజీలేని యుద్ధం. ఒకరిలో ఒకరు ఐక్యమవ్వడానికి ఇద్దరూ ఒక్కటవ్వడానికి. మనసులను, శరీరాలకు పెనవేసి చేసిన యుద్ధం.

ఆ యుద్ధంలో ఇద్దరూ విజేతలే! అతని పెదవులు ఆమె అనాచ్ఛాదమైన అణువణువునూ స్పృశిస్తుంటే, అతని కళ్ళలో నుంచి జారి రాలిపడే కన్నీళ్లు ఆమెను క్షమించమంటూ అభిషేకిస్తున్నాయి.

సృష్టి ధర్మమైన ఆ కలయిక ఆ ఇద్దరిలోనూ మానసిక, శారీరకోత్తేజాన్ని ఇస్తుంటే...

ఓ 'కల' నాలో కలవరాన్ని లేపి, ఆ 'కల'ను వరంగా మార్చి... అందమైన 'కల'గా మార్చింది అనుకున్నాడు కామేశం తృప్తిగా.

ఇప్పుడు ఇద్దరి మధ్య విడదీయలేని దగ్గరితనం. బయట మంచు కురుస్తూనే వుంది.